

# పెద్ద వడ్లపూడి రైల్వే గేటు

కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ

"ఊ...... ఊ...... ఊ......".

అంటూ వికారంగా రొదపెడుతూ పెదవడ్లపూడి రైల్వేగేటు రోడ్డుకు అడ్డంపడ్డది. విజయవాడ, తెనాలి వైపునుంచి వచ్చేపోయే బసులు లారీలు రైలుకట్టకు రెండు పక్కలా ఠక్కున ఆగిపోయాయి.

ఆషాఢంపోయి శ్రావణం జొరబడ్డది. అయినా ఈ యేడాది వానలింకా వంగలేదు. నిన్నపడ్డ బట్టతడుపు జల్లుకేగామోలు ఈ పొద్దు ఎనిమిదింటికే ఎండ కరకర లాడుతోంది. గాలికూడా బిగదీయడంతో బసులో కిటికీ పక్కనే కూచున్నా యమా వుక్కదీస్తోంది. చెమటకు వొళ్లు చిటచిటలాడుతోంది.

బసులు అట్టా ఆగాయోలేదో ఒక్కసారిగా........

"ఏర్పనక్కాయ్..., ఏర్పనక్కాయ్..., తపటగాయ్!"

"సోడా..., చల్లనిసోడా..., ఐస్సోడా...!"


"పూలండీ..., పూలో..., మల్లేపూలు...!"

అరుపులూ కేకలు చుట్టుముట్టాయి.

ఎడంచేతిలో పూల పల్లిక, కుడిచేతిలో పూలచెండు పట్టుకుని ఓ పిల్లోడు ఆడోళ్ళున్న సీట్లవైపు పరుగెత్తాడు. ఆడు బసు టైరెత్తుంటాడు. బసుగొట్టాలపాగా ఆటి టైర్లతో లేచే ఎర్రదుమ్ముతో. ఆడిమొహం దువ్వబారింది. జుట్టు చీకేసిన తాటిగింజపీసుకుమల్లే వుంది. తల్లోంచి చెమట మొహంమ్మీదకి దిగ్గారి చారికలు కట్టాయి. చొక్కాకి గుండీలేనిచోట పిచ్చితుమ్మ ముల్లు పెట్టుకున్నాడు. తీరైన ముక్కు చురుకైన కళ్ళతో వాడి మొహంలో ఏదో చిన్ని ఆకర్షణ. వాడు రోడ్డుమీద ఉల్లిత్తులా ఎగురుతూ పూలచెండును బసు కిటికీ మీదకు విసురుతూ వసపిట్టల్లే అరుస్తున్నాడు.

"పూలండీ..., మల్లేపూలు..., మల్లేపూలు, బొడ్డుమల్లె..., కాగడామల్లె..., సెంటుమల్లె, సెంటూమల్లేపూలండీ..., మల్లేపూలు." అని గుక్క తిప్పుకోకుండా అలుపూసొలుపూ లేకుండా అరుస్తున్నాడు. పూలు తీసుకున్న వాళ్ళనుండి డబ్బులు తీసుకుని చూసుకుని లాగుజేబులో వేసుకుంటున్నాడు.

"ఒరే శివుడూ బసు దొరికితే వదలవుగందా...!" అంటూ నవ్వుతూ పూలమ్మే ఓ ముసలోడు ఇంకో బసు దగ్గరకెళ్ళాడు ఇంక బసు యాపారమంతా శివుడుదే. పూలన్నీ ఈ బసు జనానికే అమ్మెయాలన్నంత



ఆరాటం ఆడిలో కనబడుతోంది. బసు చుట్టూ ఒకటికి రెండుసార్లు తిరిగాడు. ఇంకోసారి ఇటేపువచ్చాడు.

ఆడి చూపు ఓ పడుసుజంటమీద పడింది. వాళ్ళతో ఓ చెండుకొనిపించాలనుకున్నాడు.

సిగిరెట్టు కాలుస్తూ పూలని చూసీ చూడనట్టున్నాడతను. ఆమె చూపులు పూలచుట్టూ తిరుగుతున్నాయి. తలంటుస్నానం చేసి బయలుదేరినట్టుంది ఆమె జుట్టు వదులుజడలో కుదురుగా వుంటఢ లేదు. ఆమె చూపుల్ని పసిగట్టాడుశివుడు. వాళ్ళ కిటికీ ముందువాలాడు.

"పూలండీ మల్లేపూలు
బారెడుమాల
అద్దురూపాయేనండీ
మల్లేపూలండీ.... సెంటూమల్లే"

అంటూ ఆమెను మరింత ఆశపెట్టాడు. ఓ పూలచెండును కిటికీ మీదకు విసిరి మరీ అరుస్తున్నాడు.

ఆమె అతణ్ణి మోచేతితో తట్టింది. అతను ఆమెవైపు చూశాడు. పూలుకావాలని కనుబొమలతో ఆమె అతనికి సైగ చేయడం కిటికీ కడ్డీపట్టుకుని ఎగిరిని శివుడికంటబడింది: అంతే......

"ఈ చెండు తీసుకోండయ్యగారూ, మీ సిగిరెట్టుకరీదు లేదు. అక్కయ్యగారికి ఆ మాత్రం కొనిపెట్టలేరా?" అన్నాడు శివుడు. ఆ మాట తగలాల్సినచోట తగిలింది.

రీతిక శీర్షిక యువతకై ప్రత్యేకించిన శీర్షిక. యువకవులు, కథకులు అనేకమంది తమ కథలను, కవితలను 'ఆహ్వానం' పత్రికకు పంపుతున్నారు. వీరిని ప్రోత్సాహించేందుకై రీతిక శీర్షికలో క్రొత్త కవులకు, కథకులకు కొన్ని పేజీలు కేటాయిస్తున్నాం. ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన యువతరం తమ కథలను, కవితలను సామాజిక అవగాహన కొరవడకుండా సంక్షిప్తంగా రాసి పంపితే ప్రచురిస్తాం. --ఎడిటర్

అతనికి. ఆమె కిసుక్కున నవ్వింది.

"ఇహిహీ సరే ఓ చెండివ్వరా....." అన్నాడతను. అనుకున్నది సాధించాడు శివుడు. ఇంతలో "ఓ పూలబ్బాయ్!" ఎవరో పిలిచారు. "డబ్బుల్దియ్యండి బాబూ" అంటూ శివుడు అవతలిపక్కకు వెళ్ళాడు. రేపల్లెరైలు గేటుదాటి వెళుతోంది. "ఇంకా నాలుగు చెండ్లు మిగిల్నియ్యే!" గొణుక్కున్నాడు శివుడు. పూలు తీసుకున్న ఆడవాళ్ళు డబ్బులిచ్చారు. శివుడు మళ్ళీ ఇటువచ్చాడు. రైలుగేటు పైకి లేచింది. బసులు సాగాయి. "బాబు బసుపోతోంది డబ్బులియ్యండి" అరిచాడు శివుడు.

అతను ఎనకజేబులోంచి పరుసు తీసి జిప్పులాగి ఓ నోట్లపొత్తిని బయటకు లాగాడు. సిగరెట్టుని నోట్లో విలాసంగా . పెట్టుకుని పొత్తిలోంచి రెండు రూపాయలకాయితాన్ని తీశాడు. నోట్లపొత్తిని తిరిగి భద్రంగా పరుసులో పెట్టి జిప్పువేసి జేబులో పెట్టుకున్నాడు. బసు ఊపందుకుంటుది రైలుగేటునుకూడా దాటింది.

శివుడు బసుతోపాటు పరుగెత్తుతున్నాడు. వాడిచేతిల్లో పల్లిక అట్టాగేవుంది. చెప్పుల్లేని కాళ్ళకి రోడ్డుపక్క సన్నకంకర గుచ్చుకుంటూనే వుంది. అయినా వాడికదేం తెలియదు. బసుని బాదుతున్నాడు.

"ఇదుగో డబ్బులియ్యయ్యా బాబూ!"

అరిచాడు శివుడు. "చిల్లరివ్వరా" అని రెండు రూపాయల కాయితం చూపిస్తూ అతను చెయ్యి బయటకు పెట్టాడు. శివుడు లాగు జేబులోంచి చిల్లరతీసి చూసి అతని చేతిలో పెట్టేందుకు బసుకి మరింత దగ్గరగావచ్చి ఎగురుతున్నాడు. ఎదురుగా వచ్చే లారీని తప్పించేందుకు డ్రైవరు బసును సర్రున ఇటుపక్కకు కోశాడు. హఠాత్తుగా 'అ' (పెద్దగా) 'మా' (అస్పష్టంగా) అరుపు.

పూలపల్లిక అల్లంత దూరాన పడ్డది. బసుముందుకెళ్ళి ఆగింది. బసులోంచి జనం గబగబా కిందకు దిగారు. గేటుకాడ అమ్మేజనం ఏదోజరిగిందని లగెత్తుకొచ్చారు. రోడ్డుమీద శివుడి శవం. దానిచుట్టూ గుమిగూడినజనం.

"అరెరే.... ఎంతగోరం జరిగిపోయింది. అందో ఆడగొంతు. ఈ పిల్లోడికి అప్పుడే నూరేళ్ళు నిండినియ్యి ఏ తల్లికి కదుపుకోతో?" అందో పెద్దామె.

"వీడయ్య దేశాలమీదకి పొయ్యాడు. ఆదిగుల్తో అమ్మ సచ్చిపోయింది. కళ్ళులేని అమ్మమ్మని, సెల్లెల్నీ ఇట్టా శాకిరీ సేసి ఈడే బతికిత్తన్నాడు. ఆ పిల్లని బడికంపి పదివిత్తన్నాడు. రేత్రి బడికెల్లి ఆదూ సదూకుంటన్నాడు. పైకొచ్చేగుణాలున్నయ్యనుకున్నాం. ఈయాలయాకంగా పైకెల్లిపోయాడు." అంటూ కళ్ళొత్తుకున్నాడు పూలమ్మే ముసిలోడు.

రెండురూపాయలతనూ గుంపులో వున్నాడు. అతని ఎనక ఆమెకూడా వుంది. శివుడిచ్చిన పూలచెండు ఆమె చేతిలోనే వుంది. కన్నీటితో అది తడుస్తోంది. "అక్కయ్యగారు" అన్న శివుడిమాట ఆమె చెవుల్లో గింగిరిమంటున్నాయి. రెండు రూపాయలకాయితం అతని చేతిలోనేవుంది. నోట్లో సిగరెట్టూవుంది. ఎంత పీల్చినా పొగనోట్లోకి వస్తున్నట్టులేదు.

పుస్తకాల్ని పట్టుకుని ఓ చిన్నపిల్ల జనాన్ని నెట్టుకుంటూవచ్చింది. నెత్తురు మడుగులో పడున్న శివుడి శవాన్ని చూసింది.

'అన్నాయ్!' అంటూ పడిపోయింది. ఆమె ఒక్కదుటున ముందుకొచ్చి వాళ్ళిద్దర్ని తేరిపార చూస్తోంది. కిందపడ్డ ఆ పిల్లచెయ్యి కాలవకట్టిన శివుడినెత్తురులోవుంది. చెల్లెలి కోసమే అన్నట్టు శివుడికళ్ళు తెరుచుకునివున్నాయి. ఆమె చేతిలోని పూలచెండు జారి శివుడి కళ్ళమీద పడ్డది. ●

ఉగాది శుభాకాంక్షలు :

Phone : 63816

R. R. Industries

Mfrs. BANIANS, T.SHIRTS, NIGHTIES, SPORTS WEAR AND KIDDY WEAR

మెత్తగా, హాయిగా, ఆత్మీయమైన అనుభూతిని అందించే ఆర్.ఆర్.హోజైరీ వస్త్రాలకై సంప్రదించండి

టీషర్ట్స్, బనియన్స్ ఆర్డర్స్‌పై ప్రింటింగ్ తో సప్లై చేయుట మా ప్రత్యేకత

ఆర్.ఆర్. హోజైరీస్ సూపర్ బజారులో లభించును

ADDRES :

26-20-6, Swamy Street,
Behind Raj Yuvaraj Theatre
Gandhinagar
VIJAYAWADA - 520 003